# చెట్టునీడ

అది మే నెలలోని ఒక ఆదివారం. ఉదయం తొమ్మిది గంటలు దాటుతూంది. అప్పటికే సూర్య భగవానుడు కళ్ళెర్రజేసి కరుకు టెండలను క్రక్కుతున్నాడు. అరేబియన్ మహాసముద్రం ఆ కరుకుటెండలను 'కామ్'గా త్రాగేస్తూ పైకి మాత్రం నిబ్బరంగా, నిండుగా కనిపిస్తోంది. పైగా ధగధగలాడుతూ, తళ తళ మెరుస్తోంది....

ఆ మహాసముద్రం వడ్డునే వున్న బొంబాయి మహానగరం కూడా లోపల ఎంత కుళ్ళున్నా, మరెన్ని లుక లుకలున్నా దూరాన్నుంచి చూస్తానికి మేడిపండులాగా మిలమిల లాడుతూ ముచ్చటగా వుంది.

"గేట్‌వే ఆఫ్ ఇండియా" దగ్గర మహాసందడి, మరెంతో హడావుడిగా వుంది. టూరిస్టులను ఎక్కించుకుని స్టీమర్లూ, లాంచీలు 'ఎలిఫెంటాకేవ్స్' కేసి విహార యాత్రకు తీసుకుపోతున్నాయి.

'ఎలిఫెంటా కేవ్స్'ను తారాపూర్ గుహలని కూడా అంటారు. అవి ఒక చిన్న ద్వీపంలో వున్నాయి. కళాపిపాసకులు, కళాపోషకులూ అయిన ఎవరో పూర్వ రాజులు ఆ గుహల్లో శివలీలలను వర్ణించే సుందర శిల్పాలను చెక్కించారు. అవి యిప్పుడు 'ఎలిఫెంటాకేవ్స్'గా ప్రసిద్ధి కెక్కి ఎంతోమంది యాత్రికుల్ని ఆకర్షిస్తోన్నాయి.

ఆ కొండపైకి నిటారుగా వున్న రాతిమెట్లదారి విహారయాత్రికుల్ని చేతులు చాచి ఆహ్వానిస్తున్నట్లుంది; పచ్చటి చెట్లతో, చల్లటి నీడపట్టులతో అప్పుడు ఆ ద్వీపం పెళ్ళి విడిదిలాగా వుంది.

దూరంగా కనిపిస్తోన్న స్టీమర్లనూ, లాంచీలను చూడగానే కొండమీద సందడి మొదలైంది. పాప్‌కారన్స్, చిప్స్ పొట్లాలు అమ్ముకునే వాళ్ళూ, కూల్‌డ్రింక్సూ, పూసల గొలుసులూ అమ్మేవాళ్ళూ, మంచినీళ్ళ కుండల వాళ్ళూ, ముష్టివాళ్ళూ తెగ హడావుడిపడిపోతున్నారు. ఆదుర్దాగా, ఆశగా టూరిస్టులు కోసం ఎదురుచూస్తున్నారు.

మెల్లమెల్లగా దగ్గరవుతున్న లాంచీలను కొండమీద నుంచి చూడగానే రావులమ్మ మొగం చాటంతయింది; ఆమె నల్లటి కళ్ళల్లో ఆశల వెలుగులు తారట్లాడాయి.

పాలకోసం వూరికే తన రొమ్ముల్ని చీకుతూన్న కూతుర్ని ప్రక్కకి లాగి రెవిక సరిచేసుకుంది. నోటిదగ్గర 'చీకుడు' పోగానే ఆ పిల్లది ఏడ్పు లంకించుకుంది.

'రెండేళ్ళు దాటుతున్నా ఈ ముదనష్టపుదానికి పాలకుతే!' అని కూతురు పిర్రమీద ఒకటిచ్చుకుంది. దానితో ఆ పిల్ల గుక్కపట్టింది.

ఆ పిల్ల అలా ఏడుస్తూనే పిప్పరమెంట్లు అమ్మేవాడి వంక చూపించింది. రావులమ్మకు కూతురు మీద జాలి ముంచుకొచ్చింది. రొంటిన తడుముకుంది అలవాటుగా. రొంటి ఖాళీ అయి రెండురోజు లయింది.

'నాకాడ పైసలున్నాయంటే!'' అని కూతుర్ని తిట్టింది. బిల్లలమ్మే వాడ్ని ఒక బిల్ల యియ్యమని బ్రతిమాలింది. డబ్బుల్లేందే ఇవ్వనన్నాడు. వాడ్ని తిట్టుకుంది. పిల్లను తిట్టింది. తనను తాను తిట్టుకుంది.

అలా తిట్టుకుంటూనే పిల్లను చింతచెట్టు కొమ్మకు కట్టిన గుడ్డ వుయ్యాలలో పడేసి విసురుగా వూపసాగింది. అలా వూపుతూ మధ్యలో మధ్యలో ఆదుర్దాగా లాంచీలవయిపు చూస్తోంది. లాంచీలు వడ్డున ఆగాయి. టూరిస్టులు మెల్లగా ఒక్కొక్కరే దిగుతున్నారు.

టూరిస్టుల కెదురెళ్ళి వెంటబడి బ్రతిమాలితేనేగాని బేరాలు దొరకవు..... వాళ్ళు దిగిపోతున్నారు; ఇది ఇంకా ఏడుస్తూనే వుంది..... రావులమ్మకు కంగారెక్కువయిపోయింది. ఏం చెయ్యాలో పాలుపోలేదు.

ఇంతలో ఆమె దృష్టి ఆ ప్రక్కనే మెట్లమీద కూర్చున్న కుష్ఠి బేగం మీద పడింది.

పిల్లదాన్ని కాస్త వూపుతుండమని దాన్ని బ్రతిమాలింది. అది 'సరే!' అంది.

గబగబా రాళ్ళ గుట్టమీద ఆరేసిన పాత వాయిలు చీర తీసికొని చెట్టుచాటు కెళ్ళింది. మరాఠీ వాళ్ళు కట్టే పద్ధతిలో గోసిపోసి చీర కట్టింది. కొనగోళ్ళతో జుట్టు దువ్వుకొని ముడేసుకుంది. రవిక కొసలు గట్టిగా ముడేసుకుంటూ, 'సుబ్బరంగా వుండకపోతే టూరిస్టులు కన్నెత్తి కూడా చూడరు. ఆ 'లచ్మీభాయి' సిల్కుచీర కట్టి, పూలు పెట్టుకొని, 'పాన్' వేసుకొని నీటుగా వుంటుంది. అందుకే దానికంత గిరాకీ!' అనుకుంది.

'పిల్లది జాగర్త!' అని మళ్ళీ ఇంకో సారి కుష్ఠి బేగంకు చెప్పి హడావుడిగా క్రిందకు పరుగెత్తింది....

* * *

'లచ్మీభాయి' ఎలా పట్టిందో అప్పుడే మంచి బేరం పట్టేసింది. డాబుగా దర్జాగా వున్న ఒక సింధీ కుటుంబాన్ని పట్టింది. వాళ్ళ పిల్లవాడ్ని చంకనేసుకుని, మరో చేత్తో వాళ్ళ టిఫిన్ బుట్టలూ, సంచులూ పట్టుకొని వాళ్ళ వెనకాల నడుస్తోంది. తనను చూచి గర్వంగా తల విసిరేసింది.

రావులమ్మ ఎదురు వస్తోన్న గుంపుకేసి ఆశగా నడిచింది. 'అమ్మా! మీ బాబును (పాపను) కొండమీద కెత్తుకొస్తా! మీ సామాను మోస్తా!' అని వాళ్ళ వాళ్ల వేషభాషల్ని బట్టి తన భాషను మార్చుతూ హిందీలో, మరాఠీలో, గుజరాతీలో బ్రతిమాలసాగింది.

ఎవరికి వాళ్ళు వద్దని తలలు అడ్డంగా వూగిస్తూ తనని దాటుకుపోతూన్నారు. కొందరు అసలు తన మాటే వినిపించుకోవటంలేదు; తన వంకే చూడటం లేదు.

నిరాశగా నీరసంగా నిలబడిపోయింది. ఆమె మొగం కొడిగట్టిన దీపం లాగా కాంతి విహీనమై పోయింది. ఆదివారంనాడుకూడ తనకు 'కూలి' దొరక్కపోతే ఆ పిల్లముండ ఆకలి ఎలా తీరుస్తుంది? తన కడుపు ఎలా నింపుకుంటుంది? ఎన్నాళ్ళని వుత్త మంచినీళ్ళు త్రాగి కడుపులు నింపుకోవాలి?

అంతలో ఆమె దృష్టి ఎదురుగా వస్తోన్న యిద్దరు పంజాబీ స్త్రీల మీద పడింది. అందులో ఒకామె స్థూలకాయ. తన ఒళ్ళు బరువు తనే మోయలేకపోతుంది. పైగా ఏడాది వయసులో వున్న ఓ కుర్రాణ్ణి చంకనేసుకుంది. మరో చేత్తో టిఫిన్ బుట్టలూ గట్రా పట్టుకుంది. ఇవి చాలవన్నట్లు మూడేళ్ళ వయస్సులో వున్న ఒక గుంటడు ఎత్తుకోమని ఆమెను వేధిస్తోన్నాడు. ఆమె ప్రక్కనున్న యువతికి ఇదేం పట్టినట్లు లేదు. చలవకళ్ళజోడులోంచి ఎటో చూస్తోంది. ఎక్కడ బట్ట నలుగుతుందో, యెక్కడ జుట్టు చెరుగుతుందో నన్నట్లుంది. మనిషి నీటుగా నిండుగా వుంది. ప్రక్కన మొగవాళ్లెవరూ లేరు.

వత్తి ఎగదోసినట్లు రావులమ్మ మొగంలో ఆశ తొంగిచూచింది. 'నాకిట్టాంటోళ్లే దొరకాలి గంగానమ్మ తల్లీ' అని మనస్సులో అనుకుంది.

వుషారుగా ఆ పంజాబీ మేంసాబ్‌ల కెదురెళ్ళింది. 'మోతకూలి' ఇప్పించమని హిందీలో ప్రాధేయపడింది.

గుండమ్మలాంటి ఆ పంజాబీ 'బండమ్మ' ఎన్నో కండిషన్లు పెట్టింది. మళ్ళీ క్రిందకు వచ్చేవరకు వాళ్ళతోపాటే వుండాలంది. వాళ్లు తిన్న పాత్రలన్నీ కడగాలంది. మంచినీళ్ళు కూడా తీసుకొచ్చి యివ్వాలంది. పిల్లలు ఎటూ పోకుండా, ఏడవకుండా ఆడించాలంది. కూలి మాత్రం రెండు రూపాయలే! ఐదు రూపాయలిప్పించమనీ, దయ చూపించమనీ రావులమ్మ ఎంతగానో బ్రతిమాలితే చివరకు మూడు రూపాయలకు సెటిల్ చేసింది.

ఇకప్పట్నుంచి రావులమ్మ అసలు కష్టాలు ప్రారంభమయ్యాయి.

మూడేళ్ల ఆ గుంటణ్ణి ఒక చంకలో తినుబండారాలున్న ఒక పెద్ద ప్లాస్టిక్ బుట్టను మరో చేత్తో, బరువుగా వున్న ఎయిర్‌బేగ్‌నూ వాటర్ బోటిల్‌నూ ఒక భుజానికీ, క్రింద పరుచుకొని కూర్చునే జంపఖాణాలు మరో భుజంమీదా వేసుకుని ముందుకు సాగింది.... ఆ మోత బరువులో రావులమ్మ 'కంచరగాడిద' అయిపోయింది!

రావులమ్మ ముందూ - వెనక ఈ పంజాబీ మేం సాబ్‌లున్నూ! ..... నిటారుగా ఎగుడుదిగుడుగా వున్న ఆ రాతిమెట్ల దారి రావులమ్మకు అలవాటే! రెండేళ్ళకు పైగా 'మోతకూలి'గా ఆ మెట్లదారినే నడుస్తూంది.

రావులమ్మ బొంబాయికి రాకపూర్వం గుల్బర్గాలో వుండేది. ఆమె తండ్రి పాతపాత్ర సామానుకు మాట్లూ, కళాయిలూ వేస్తుండేవాడు. తనకు అయిదేళ్ళ వయసున్నప్పుడే తల్లి చనిపోయింది. అప్పట్నుంచి తండ్రే పెంచాడు.

అసలు వాళ్ళు తెలుగు వాళ్ళే. ఎప్పుడో వాళ్ల తాత ముత్తాతల కాలంలో ఇటు వయిపుకు వచ్చేశారు.

ఆమె తండ్రి టౌన్లో వీధివీధికీ తిరిగి అరుస్తూ పాతసామాను పోగుజేసుకొని తెచ్చేవాడు. వాళ్ళ గుడిశముందున్న రావిచెట్టు క్రింద కొలిమి పెట్టి వాట్ని బాగుచేసేవాడు.

రావులమ్మ రావిచెట్టు క్రింద ఒక చిన్న బెంచీ వేసుకుని దానిమీద బిల్లలూ, లవుజులూ, జీడీలూ

సీసాల్లో పెట్టుకొని అమ్ముతుండేది. తండ్రికి ఒకప్రక్క పనిలో సాయం చేస్తూ మరోప్రక్క బేరం అమ్మేది.

బేరమంటే ఎంతా? రోజంతా అమ్మినా, ఆఅమ్మకం రూపాయి దాటేది కాదు. కాని, అమ్ముతుండగానే రోజులూ, నెలలూ, సంవత్సరాలు దాటిపోయాయి. డబ్బు కూ ్బెట్టకపోయినా వంటినిండా అందాన్ని, యవ్వనాన్ని కూడబెట్టుకుంది. విరగబూచిన తంగేడు లాగా వుండేది; వురవడి వచ్చిన వాగులాగా వుండేది....

రావులమ్మ చంకలోని గుంటడు పెద్ద గుండ్రాయిలాగా బరువుగా వున్నాడు. వాడు మాటిమాటికి క్రిందకు జారిపోతున్నాడు. వాడ్ని మోయలేక తన నడుం విరిగిపోతూంది. వాళ్ళు తగిలించిన బరువుతో తన భుజం గుంజుకుపోతూంది.

పాలూ వెన్నలతో బాగా బలిసిన ఒక స్థూలకాయురాల్ని డోలీలో నలుగురు మనుషులు పైకి మోసుకుపోతున్నారు. ఆమె అలా వూరికే ఖాళీగా కూర్చొనటం ఎందుకనుకున్నదేమో, ఒక పెద్ద పాప్‌కారన్ పొట్లాన్ని ఆరగిస్తోంది.

ప్రక్క తోటలో వున్న నెమళ్ళను చూచి రావులమ్మ చంకలో గుంటడు జర్రున క్రిందకు జారిపోయాడు. నెమళ్ళను చూచి కేరింతలు కొట్టుతూ వున్నాడు. 'రా బాబు!' అని వాడి చెయ్యి పట్టుకొని పైకి రెండు మెట్లు ఎక్కింది. ఇంతలో క్రింద నుంచి కేకలు.... 'పిల్లాడ్ని నడిపిస్తోన్నావా? నిన్ను పెట్టుకున్నది ఎందుకు?' అని బండమ్మ అరుస్తోంది.

వాడ్ని ఎత్తుకోబోతే వద్దన్నాడు బండమ్మ గబగబా పైకి వచ్చి, 'దాని చంక ఎక్కరా నాయనా!' అని బ్రతిమాలింది. నడుస్తానని వాడు మారాం చేశాడు. వూరికే పోనీవటమెందుకని తన చంకలోని చిన్న బాబును రావులమ్మ కందించింది.

ఆ చిన్నబాబు ముద్దొస్తున్నాడు. రబ్బరు బొమ్మలాగా వున్నాడు. తనను చూచి కిలకిలా నవ్వాడు. తన బుల్లి అరచేతులతో తన చెంపల మీద వూరికే బాదుతూ తెగ నవ్వేస్తున్నాడు..... రావులమ్మకు తన కూతురు గుర్తుకొచ్చింది. పిల్లది నిద్ర పోయిందో లేదో..... ఇంకా ఏడుస్తూందేమో!.... వూయలలోంచి క్రిందకు జారిపోయిందేమో.... కుష్టి బేగం సముదాయించుకుంటుందో లేదో.... తన మనస్సంతా పిల్లదానిమీదే వుంది!

.... చంకలోని చిన్నబాబు వూరికే తన జుట్టంతా లాగేస్తూ బోసినవ్వులు తెగ నవ్వేస్తున్నాడు. వాడ్ని చూస్తూంటే తనకు భలే ముచ్చటేస్తోంది; ముద్దుపెట్టుకోవాలనిపిస్తోంది. కాని బండమ్మ ఏఁవన్నా అంటుందేమోనని వూరుకుంది.

"చిన్నబాబు మీ అబ్బాయా?" అని అడిగింది.

దానికి బండమ్మ పెద్దపురాణం చెప్పుకొచ్చింది. చిన్నబాబు తన చెల్లెలు షీలా కొడుకంట. పెద్దోడు తన కుమారరత్నమంట! తను అహ్మదాబాదులో వుంటుందట. చెల్లెల్ని చూస్తానికి బొంబాయికి వచ్చిందంట. చెల్లెలు అంధేరీలో వుంటుందంట....

బండమ్మ పురాణం ఇంకా సాగేదేమో ఇంతలో పైకి చేరుకున్నారు.

రావులమ్మ వీళ్ళను తన పిల్లదాని ఉయ్యాల వున్న చింత చెట్టుకు ప్రక్కగా తీసికెళ్ళింది. అక్కడొక పెద్ద రావిచెట్టు వుంది. క్రింద చాల చల్లగా వుంది. క్రింద బాగుచేసి రావులమ్మ 'ఛత్తర్లు' పరిచింది. వాళ్ళు 'అమ్మయ్యా!' అని ఆపసోపాలు పడుతూ క్రింద చతికిల పడ్డారు. వాళ్ళు తీలా కూర్చొని కుదుటపడ్డాక రావులమ్మ గబగబా చింత చెట్టుకేసి వెళ్ళింది. వుయ్యాలలో నిద్రపోతున్న పిల్లదాన్ని చూచుకుని కుదుటపడింది.

"ఇప్పటిదాకా ఏడ్చి ఏడ్చి ఇప్పుడే నిద్దరపోయింది! వూపలేక నా సేతులు పడిపోయాయి!" అంది కుష్టి బేగం నిష్టూరంగా.

ఇంతలో పంజాబీ బండమ్మ కేకేసింది.

"మా సామానేవన్నా దానికందిస్తోన్నావా?" అని కయ్యిన లేచింది బండమ్మ.

రావులమ్మ అమాయకంగా, "మీ సామానా? ఎవరికందిస్తాను? ఎందుకందిస్తాను?" అంది.

బండమ్మ చెల్లెలు షీలా వయ్యారంగా ఒక వయిపుకు వాలి పడుకొని ట్రాన్సిష్టరులోని పాటలు వింటూ, "యిలాంటి వాళ్ళను నమ్మకూడదు! వీళ్ళకెప్పుడూ పరాయివాళ్ల వస్తువు మీదే కన్ను!" అంది.

రావులమ్మ ఆ మాటకు చిన్నబుచ్చుకుంది. 'అమ్మా తల్లీ! మేం కూటికి తక్కువయినా గుణానికి తక్కువ కాం!' అని బదులు చెప్పుదామనుకుంది. మళ్లీ వూరుకుంది.

తన తండ్రి ఎవరెవరివో, ఎంతెంతో ఖరీదు పాత్ర సామాను తీసికొచ్చే వాడు. మళ్లీ ఎవరిని వాళ్ళకు భద్రంగా అప్పజెప్పేసేవాడు. చేసిన పనిలో లొసుగు వుండేది కాదు. ఏనాడూ ఎవరితోనూ పళ్ళెత్తు మాటకూడ పడలేదు. అంత నిజాయితీగా, అభిమానంగా వుండేవాడు.

ఇంతలో మంచినీళ్ళు తీసికొని రమ్మని బండమ్మ పురమాయించింది. తను నీళ్ళు తీసుకొచ్చేసరికి వాళ్ళు టిఫిన్ కేరియర్లు విప్పుకొని ఆవురావురుమని లాగించేస్తోన్నారు.

బండమ్మ కొడుకు ఒక పెద్ద బూందీ లడ్డును చిదిమేసి క్రిందా మీదా చిందర వందర చేస్తోన్నాడు. తన మనస్సు వుసూరుమంది. ఈ లడ్డును తన పిల్లముండకిస్తే ఎంత ఆశగా, ఆనందంగా తింటుందో! అక్కర్లేని వాళ్ళకే అన్నీ ఇస్తాడు భగవంతుడనుకుంది.

చిన్న బాబు వూరికే తల్లిమీదకు పోతున్నాడు. ఆమె కొడుకును కసురుకుంటుంది. ముద్దులు మూటకట్టే కొడుకును ముద్దు చేయకుండా అలా కసురుకుంటానికి ఆ తల్లికి మనస్సెలా వప్పిందో అనుకుంది. ఇలాంటి వాళ్ళకు ఎప్పుడూ తమ అందం, ఆనందమే కాని పిల్లలు సంగతే పట్టదు.

రావులమ్మ చిన్న బాబును ఎత్తుకొని ఆడించసాగింది... రావిచెట్టు చల్లటి నీడ కన్నతల్లి వడిలాగా చల్లగా వుంది. తమ వూరిలో తమ గుడిశ ముంగిట రావిచెట్టు కూడా ఇంతే! చల్లటి నీడల్ను పంచేది; పిల్లలకు ఎండ తగలకుండా కన్నతల్లి కొంగు ఎత్తిపట్టుకున్నట్లే తన కొమ్మలను నాల్గు దిక్కులకు విస్తరింపచేసి ఎండకాసేది!

ఆ చెట్టు క్రిందే తను చిన్నపిల్లగా ఆడుకుంది. ఆ చెట్టుక్రిందే తను కన్నెపిల్లగ తొక్కుడు బిల్లలాట లాడింది. ఆ చెట్టు క్రిందే యాదవ్‌ను మొదటిసారిగా చూచి సిగ్గుపడింది... యాదవ్ సైకిల్ మీద లేబర్

పేటల్లో తిరిగి గుడ్డలమ్మేవాడు! తమ పేట కొచ్చినప్పుడల్లా ఆ చెట్టుక్రిందే సైకిలాపి కూర్చునేవాడు. తన దగ్గర బిల్లలు కొనేవాడు. వాట్ని చప్పరిస్తూ తన వంక కొంటె చూపులు చూస్తూండేవాడు. బొంబాయి సంగతులు చెప్తుతుండేవాడు. అతను చేస్వే విషయాలు తను కుతూహలంగా వింటుండేది. అతడు రెండు మూడురోజులకొకసారి తమ పేటకు వచ్చేవాడు. ఆ రెండు మూడురోజులే తనకెన్నో యుగాలుగా వుండేవి. ఒకరోజు, నాతో బొంబాయి వచ్చేస్తావా, నిన్ను పెళ్ళి చేసుకుంటాను అన్నాడు. తన తండ్రి సంపాదన తమ రెండు పొట్టలకే సరిపోవటం లేదు. తండ్రి తనకు మనువు చేయగలడా? ఈ విధంగా తండ్రికి తన భారం తగ్గించాలనుకుంది. పైగా మనస్సైన వానితో మనువు. బొంబాయి నగరంలో కాపురం!

ఒక రాత్రి రావిచెట్టు చల్లగాలి సవ్వళ్ళతో తనను చల్లగా దీవిస్తుంటే రావిచెట్టు కింద వున్న గంగానమ్మ తల్లికి, 'మా అయ్యను సల్లగా సూడు తల్లీ! నన్ను సల్లగా సూడు తల్లీ' అని దణ్ణం పెట్టి ఆ చీకట్లో రైలు స్టేషన్ వయిపుకు నడిచింది....

బండమ్మ కేకలు పెట్టి అరుస్తోంది. తను వులిక్కిపడి పరుగున ఆమె దగ్గరికి వెళ్ళింది.

"ఇందాకట్నుంచి పిలుస్తోంటే పలకవేం? నీకు చెముడు కూడా వుందా?" అంది. వాళ్ళు తిన్న పాత్రలను ఇచ్చి శుభ్రంగా కడుక్కు రమ్మంది.

ఆ పాత్రలను తీసికొని పంపు దగ్గర కెళ్ళుతుంటె కుష్ఠి బేగం వెనకాల వచ్చింది. వాటిల్లో మిగిలిన ఆడుగూ బొడుగూ దాని కొంగులో పడేసింది. ఇక పిల్లముండకేం పెట్టుతుంది?

తను కడిగి తెచ్చిన పాత్రలను బండమ్మ లెక్కపెట్టుకుంది. షీలమ్మ ఎందుకో చాల చిరాగ్గా వుంది. చిన్నబాబును మళ్ళీ తన కందించారు.

చిన్నబాబును ఎత్తుకొని ఆడిస్తుంటే మళ్ళీ పాతసంగతులు గుర్తుకు వచ్చాయి.

..... యాదవ్ తనను బొంబాయి తీసికొచ్చి ఒక మురికివాడలో కాపురం పెట్టాడు. ఎటు చూచినా కుళ్ళు కాలువలు. ముక్కులు బద్దలు కొట్టే కంపు - కన్నతల్లి లాంటి రావిచెట్టు నీడా లేదు; ఆ మంచి గాలీ లేదు. కాని యాదవ్ అందించే సంసార సుఖం మత్తులో అన్నింటిని సహించింది..... ఒకరోజు అతను చెప్పాపెట్టకుండా ఎక్కడికో తుర్రుమన్నాడు. ఎన్నాళ్ళు గడిచినా అతని జాడలేదు. తన కడుపులో మాత్రం తన 'జాడ'ను వదిలేసి మరీ పోయాడు. అది రోజురోజుకూ పెరుగుతూనే వుంది. తనకేం చెయ్యాలో తోచలేదు. వూరికి తిరిగి పోతే తండ్రి వూరుకోడు. తనను పొడిచి తాను పొడుచుకు చస్తాడు. అంత అభిమానపు మనిషి! చిన్నం చితకా అమ్ముకొని తింటూంది. కొందరు సానివాడకు పొమ్మని సలహా యిచ్చారు; మరికొందరు తనను అమ్మటానికి ప్రయత్నించారు. అప్పుడు అక్కణ్ణుంచి పారిపోయి ఈ కొండమీదకు చేరింది. ఈ 'మోతకూలి' వృత్తి చేపట్టింది.

బొంబాయికొచ్చిన కొత్తలో ఒకరోజు యాదవ్‌తో ఈ కొండమీద కొచ్చింది. తనకీ చోటు ఎంతగానో నచ్చింది. శీలం చెడకుండా కడుపు నింపుకోడానికి ఇది మంచి వృత్తి అనిపించింది. కూలి దొరికిన రోజున కడుపు నింపుకుంటుంది. లేని రోజున ఇన్ని నీళ్ళు త్రాగి ఏ చెట్టుక్రిందో పడుకుంటుంది...

ఈ కొండ మీద ఈ చెట్ల క్రిందా ఈ చేమల క్రిందా యిలా ఈ రెండేళ్లూ గడిపింది. మళ్ళీ ఏదో ఒకరోజున యాదవ్ తిరిగి వస్తాడని, తనను తీసికెళ్లుతాడనే ఆశతో బ్రతుకుతోంది. అప్పుడప్పుడు తనుండి వచ్చిన మురికివాడ కెళ్ళి అతని ఆరా కనుక్కొని వస్తుంది. అతను తిరిగవస్తే తను ఫలానాచోట వున్నట్లు చెప్పమని చెప్పివస్తుంది....

.... ఇంతలో వుయ్యాలలోని పిల్లది నిద్రలేచి ఏడవసాగింది. క్రిందకు దిగాలని కాళ్ళూ చేతులూ కొట్టుకుంటూ ఏడుస్తూ జోలిలోంచి సగం మేరకు క్రిందికి జారింది. ఇంకాస్త వుంటే క్రింద పడేటట్లుంగి. తనకు కాలూ చేయీ ఆడలేదు.

తన చంకలో వున్న బాబును బండమ్మకివ్వబోతే, "మేం క్రిందకెళ్ళిపోతున్నాం! ముందు ఇవన్నీ సర్దు!" అని ఆర్డరేసింది.

చేసేది లేక కుష్ఠి బేగంకు పిల్లను ఎత్తుకోమని కేకేసి చెప్పి సామాను సర్దసాగింది.

జంపఖాణాల మీద లడ్డుపొడుం చెల్లాచెదురుగా పడివుంది. దాన్నంతా ఏరి కొంగున మూటకట్టుకొని తర్వాత పిల్లదానికి పెట్టుదామనుకుంది. కాని ఇంతలో బండమ్మ తొందర చేస్తూ జంపఖాణాలను విదిలించేసింది. వాట్ని మడతలు పెట్టి తన భుజం మీద పడేసింది. దుమ్ముపాలైన ఆ లడ్డుపొడుంను చూస్తుంటే ప్రాణం వుసూరుమంది. బేగం చంకల్లో వున్న కూతుర్ని చూచి, 'పాపిట్టి ముండా తింటాని కదురుట్టం వుండొద్దూ!' అనుకుంది.

రావులమ్మ మళ్ళీ 'కంచరగాడిద' అవతారమెత్తింది.

ఆఖరి అయిటంగా చిన్నబాబును అందించబోతూ బండమ్మ రావులమ్మ చెమట మొగాన్ని చూచి చీదరించుకుంది. "నీ చెమటంతా మా పిల్లాడికి అంటుతుంది. ముందెళ్ళి నీళ్ళతో శుభ్రంగా మొగం కడుక్కుని రా పో!" అని కసిరింది.

రావులమ్మ పంపు దగ్గర కాళ్లూ చేతులూ కడుక్కుంటూ తన పిల్లను ఆడిస్తోన్న కుష్ఠి బేగం వంక చూచింది. దాని వంటి కురుపుల రసి అంతా పిల్లకు అంటుతూంది.....

మెట్లు దిగుతున్నంత సేపూ ఎందుకనో షీలమ్మ చాల చిరాగ్గా వుంది. పరోక్షంగా వున్న ఎవరిమీదో వూరికే కారాలూ మిరియాలూ నూరుతూంది. బండమ్మ చెల్లెల్ను శాంతపరచాలని ప్రయత్నిస్తోంది...

ఏళ్ళు రేవులోకి జేరుకునేసరికి సిటీ నుండి ఒక లాంచీ వచ్చి అప్పుడే ఆగింది. అందులోంచి జనం దిగుతున్నారు. అందులోంచి ఒక వ్యక్తి చకచకా షీలమ్మ వయిపుకు వచ్చాడు. అతను ఖరీదైన దుస్తులు వేసుకున్నాడు. చలవకళ్ళజోడు పెట్టుకున్నాడు. గుబురు మీసాలు పెంచి వున్నాడు.

అతన్ని చూడగానే షీలమ్మ కస్సుబుస్సులాడింది. ఆమెను సమాధానపర్చటానికి పాపం అతను తలక్రిందులవుతున్నాడు. "ఆ దుబాయ్ స్నేహితుడు ఒక పట్టాన వదిలాడు కాదు షీలా! ఎలాగో అతణ్ణి వదిలించుకుంటే తీరా లాంచీ దొరకలేదు. ప్లీజ్! నా మాట విను..." అని బ్రతిమాలుకోలేక ఛస్తోన్నాడు..

షీలమ్మ అతని మాటలు వినిపించుకోవటం లేదు. వూరికే చిందులు త్రొక్కుతూ వుంది. అలా చిందులు త్రొక్కుతూ అక్కడ ఆగివున్న లాంచీలలో ఒక దానిలో ఎక్కి కూర్చుంది. ఆమె వెనకాలే ఆ బండమ్మా ఎక్కింది.

రావులమ్మ అందించిన సామాను ఒక్కొక్కటే లాంచీ లోపలికి సరఫరా చేసేడు. చివర్న చిన్న బాబును అందుకుంటూ రావులమ్మ మొగం లోకి చూశాడు. అదే సమయంలో ఆమె కూడా అతని వంక తేరిపారా చూచింది.

ఆశ్చర్యంగా, "యాదవ్!" అంది

అతను యింకా ఆశ్చర్యంగా, "నీవ్వా?" అన్నాడు.

ఆశ్చర్యంలోంచి ముందుగా తేరుకుంది యాదవే! మెల్లగా తన కథ చెప్పుకొచ్చాడు. షీల భర్త అరవై ఏళ్ళ ముసలివాడంట. తను వాళ్ళ దగ్గర కారు డ్రైవరుగా చేరాడంట. మెల్లగా తనకూ షీలకూ స్నేహమయిందంట. ఈ పిల్లవాడు షీలకు తన మూలంగానే పుట్టాడంట. సంవత్సరం క్రితం ఆమె భర్త గుటుక్కుమన్నాడంట. అప్పట్నుంచి తను ఆమెకూ, ఆమె ఆస్తి పాస్తులకూ యజమాని అయ్యాడంట! తనంటే ఆమె పడిచచ్చిపోతుందంట. ఆమెతో పొత్తు పెట్టుకున్నప్పట్నుంచీ తనకు అంతా అదృష్టమేనంట. ఈ మధ్య దుబాయి వెళ్ళి చాలా డబ్బు సంపాదించుకొచ్చాడంట.

ఇలా తన కథను ఎంతో గర్వంగా చెప్పుకుపోతున్నాడు. ఇంతలో లాంచీ పెద్దగా కూత కూసి కదలటానికి సన్నద్ధమయింది.

బండమ్మ లోపల్నుంచి, "ఆ మనిషికి డబ్బు యివ్వు!" అని కేకేసింది.

యాదవ్ జేబులోంచి పర్సు బయటికి తీశాడు.

"మూడు రూపాయలకంటే పైన ఒక్క పైసా కూడా ఇవ్వమాకు!" మళ్ళీ బండమ్మ హెచ్చరించింది.

మూడు రూపాయి కాగితాలు యిచ్చి, "ఇంకా నీకేవన్నా డబ్బు కావాలా?" అన్నాడు.

"అఖ్ఖర్లేదు" అంది.

"నీవు బాగా వున్నావు కదూ!" ఆమె క్షేమం అడిగాడు.

"బాగానే వున్నాను" అంది.

తన చంకలోని కొడుకు బుగ్గమీటీ నవ్విస్తూ, "మాబాబు బాగున్నాడు కదూ!" అన్నాడు గర్వంగా.

"చాలా బాగున్నాడు" అంది.

"అయితే మరిక నేను వస్తా!" అని పిల్లాడ్ని ఎత్తుకొని లాంచీ లోపలికి వెళ్ళిపోయాడు.

లాంచీ మళ్ళీ కూతకూసి మెల్లగా ముందుకు కదిలింది.....

"ఇదిగోనమ్మా నీ పిల్ల! అబ్బ పాడు పిల్ల, సేతుల్లో నిలవకుండా ఎట్టా సతాయించి పెట్టిందో!" అంటూ కుష్టి బేగం పిల్లదాన్ని అందించింది.

రావులమ్మ కూతుర్ని ఎత్తుకొని దూర దూరంగా పోతున్న ఆ లాంచీ వంకే చూస్తూ నిలబడింది.

- స్వాతి మాసపత్రిక, అక్టోబరు *1980*

★